epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 58 | గురువారం | 27.06.2024




## జనగామను ఆరోగ్యవంతమైన

# జిల్లాగా తీర్చిదిద్దాలి

- పిల్లలు మత్తుకు దూరంగా ఉండాలి
- మత్తు పదార్థాలు వాడినా.. అమ్మినా కఠిన చర్యలు
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా, ఆరోగ్యవంతమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ చౌరాస్తా నుంచి నెహ్రూ పార్క్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో కలెక్టర్ చీఫ్ గెస్ట్‌గా పాల్గొని మాట్లాడారు. - మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి

2 లో



## అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చాలి

3లో..




2 లో

## పెరిగిన ధరలను నియంత్రించాలి



## గెస్ట్ హౌస్‌ను సీజ్ చేసిన బల్దియా అధికారులు


- పర్మిషన్ లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపణ

3



## ముగిసిన ప్రెస్ క్లబ్ స్పోర్ట్స్ మీట్

5



## హారర్ కామెడీలో రష్మిక మందన్నా..

4

General News



# జనగామను ఆరోగ్యవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలి

- పిల్లలందరూ మత్తుకు దూరంగా ఉండాలి
- మత్తు పదార్థాలు వాడినా.. అమ్మినా కఠిన చర్యలు
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

జనగామ జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా, ఆరోగ్యవంతమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక నెహ్రూ పార్క్ వద్ద గల కామాక్షి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీలు అంకిత్ కుమార్ శంఖ్వార్, భీం శర్మ, నర్సయ్య, డీడబ్ల్యూఓ జయంతి, డీఈఓ రాము, డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్‌తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసైతే సమాజానికి చాలా ప్రమాదమని, ప్రధానంగా ఈ మాదక ద్రవ్యాలు మనిషి ఆలోచనా పరిజ్ఞానాన్ని తగ్గిస్తుందన్నారు. అలాగే అతిగా మొబైల్ ఫోన్ వాడకం కూడా విద్యార్థుల ఏకాగ్రతను నశింపజేస్తుందని, దేశంలో మొత్తం నాలుగు కోట్ల మంది ఈ మత్తుకు బానిస అయ్యారని తెలిపారు. అదే విధంగా మద్యపానం, ధూమపానం కూడా దీని కిందకు వస్తాయని, జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరూ కూడా ఇలాంటి బానిసత్వం నుంచి బయటకు రావాలని సూచించారు. ఇందుకోసం మనందరం సమష్టిగా కృషి చేయాలని, ఎవరైనా ఈ మత్తు పదార్థాలను ఉపయోగించినా, క్రయవిక్రయాలు చేసినా తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే దీనిపై సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం అందజేస్తామన్నారు. సినిమాల్లో చూపించే చెడును అనుకరించొద్దని, మంచిని మాత్రమే తెలుసుకోవాలని అన్నారు. మత్తుకు పిల్లలందరూ దూరంగా ఉండాలని కోరారు. అలాగే జిల్లాలో చాలా చోట్లలో ధూమపానం ఎక్కువగా ఉందని, దీని వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, పొగాకు క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందని, ఇలాంటి చెడు అలవాట్లకు అందరూ దూరంగా ఉండాలన్నారు. అన్ని మండల కార్యాలయాల్లో, ప్రతి ఒక్క విద్యాసంస్థలో ఈ టోల్ ఫ్రీ నంబర్ 14446 ను ప్రదర్శించాలని, దీనిపై విస్తృత స్థాయి ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## మత్తు నిషేదానికి కృషి చేయాలి

**– డీసీపీ రాజమహేంద్ర నాయక్**



మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరం ప్రతిజ్ఞ చేయాలని, జిల్లాలో మత్తు పదార్థాల నిషేధానికి కృషి చేయాలని డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. ప్రతి బడిలో వారంలో ఒక రోజు విద్యార్థుల బ్యాగ్‌లను తనిఖీ చేయాలన్నారు. గుట్కా, గంజాయి, మద్యపానం, బెట్టింగ్, పేకాట ఇవన్నీ కూడా దీని కిందికి వస్తాయని, పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లల్లో ఏమైనా మార్పు కనిపిస్తే వెంటనే గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా కలెక్టర్, డీసీపీ, ఏసీపీలు, ఇతర అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అదే విధంగా సెల్ఫీ పాయింట్, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తర్వాత మాదక ద్రవ్యాల నిషేధానికి మిషన్ పరివర్తన కింద పోస్టర్లను ఆవిష్కరించారు. అంతకుముందు చౌరస్తా నుంచి నెహ్రూ పార్క్ వరకు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ప్రభావతి, రిసోర్స్ పర్సన్ డాక్టర్ సిద్ధారెడ్డి, ఎఫ్ఆర్వో, కమ్యూనిటీ మొబిలైజర్, సీడీపీఓలు, ఎస్ఐలు, సీఐలు, సఖి సిబ్బంది, ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.





# జనగామ డీసీపీని కలిసిన గిరిజన నేతలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ నూతన డీసీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాజమహేంద్ర నాయక్‌ను జిల్లాకు చెందిన గిరిజన నాయకులు కుర్ర రాజేందర్ నాయక్, కిరణ్ కుమార్ నాయక్, ధర్మ భిక్షం నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం జనగామ డీసీపీ కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం జనగామ జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన సమస్యలను డీసీపీకి వివరించినట్లు వారు తెలిపారు.



# ధరలను నియంత్రించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి
- హనుమకొండలో వినూత్న నిరసన

**హనుమకొండ, మన చౌరాస్తా :** పెరిగిన నిత్యావసర ధరలను నియంత్రించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ అంబేద్కర్ సెంటర్ లో పెరిగిన ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో వినూత్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ గత నెల రోజులుగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటినా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యులకు మోయలేని భారంగా మారిందని అన్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటాయని, టమాట, పచ్చిమిర్చి కిలో రూ.100కు చేరుకున్నాయన్నారు. ఉల్లిగడ్డ కిలో రూ. 50కి చేరుకుందని, గడిచిన నెల రోజులలోనే ధరలు అమాంతం పెరిగినా పాలకులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదు కానీ మార్కెట్ లో కూరగాయల ధరలు మండిపోతున్నాయని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు కఠిన చట్టాలను రూపొందించి, బ్లాక్ మార్కెట్, దళారులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు కొట్టెపాక రవి, రాసమల్ల దీనా, కామెర వెంకటరమణ, కండె నర్సయ్య, పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు.

Local News

# నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- **అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించన కలెక్టర్**



**జనగామ, మన చౌరాస్తా :** అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. బుధవారం జిల్లాలోని శామీర్‌పేట్ గ్రామంలోని అంగన్‌వాడీ-2 కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలించి, చిన్నారులకు అందించే ఆహారం పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలతో శుచిరుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఆహారం వండే వంట పాత్రల విషయంలో పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. కేంద్రానికి వచ్చిన గుడ్ల నాణ్యతను పర్యవేక్షించి, కొలత ప్రకారంగా గుడ్లు ఉండే విధంగా సరి చూసుకోవాలని, ప్రతి రోజూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా అందించాలని అన్నారు. కేంద్రంలోని బలహీనంగా ఉన్న పిల్లల బరువు, ఎత్తు కొలతలను పరిశీలించి, ప్రతి వారం చిన్నారుల బరువు కొలతలను ఎంతో జాగ్రత్తగా సరైన విధంగా నిర్వహించాలని, ఆ వివరాలను ఆన్‌లైన్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అదే విధంగా సీడీపీఓలు, సూపర్ వైజర్లు ఈ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని, అలాగే పిల్లల బరువు, ఎత్తు కొలతలు వంద శాతం ఉండే విధంగా చూడాలని సూచించారు. బలహీనంగా ఉన్న చిన్నారుల తల్లులతో మాట్లాడి, వారికి తగిన సూచనలు చేశారు. కేంద్రంలో అందించే ఆహారంతో పాటు ఎక్కువ సార్లు ఆహారాన్ని తీసుకోవాలని ఆరోగ్య లక్ష్మీ తల్లులకు సూచించారు. కలెక్టర్ వెంట డీడబ్ల్యూఓ జయంతి, సీడీపీఓ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



**కేసీఆర్‌తో జనగామ ఎమ్మెల్యే పల్లా భేటీ...**

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనట్టు తెలుస్తోంది. పల్లా వెంట మాజీ మంత్రి మల్లారెడ్డి తదితర నేతలు ఉన్నారు. - మన చౌరాస్తా, జనగామ

# గెస్ట్ హౌస్‌ను సీజ్ చేసిన బల్దియా అధికారులు

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ నగర పరిధి ఎల్ బి నగర్ లో ఎలాంటి వ్యాపార అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఏఎస్ గెస్ట్ హౌస్‌ను బల్దియా శానిటేషన్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భం గా ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజేష్ మాట్లాడుతూ నగర పరిధి ఎల్ బి నగర్ లో వ్యాపార అనుమతులు పొందకుండా అతిథి గృహాన్ని నిర్వహించడమే కాకుండా కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నారనే ఫిర్యాదుల అందినందున జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటేషన్ అధికారులు దాడి చేసి తెలంగాణ పురపాలికల చట్టం 2019 లోని సెక్షన్ 264 ప్రకారం సీజ్ చేసినట్టు తెలిపారు. అనుమతులు లేని కారణంగా నోటీసులు అందజేయడం జరిగిందని, అయినా ట్రేడ్ లైసెన్సు పొందకుండా వ్యాపారం చేస్తున్నారని, అందుకే సీజ్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధరం సింగ్‌తో పాటు జవాన్‌లు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయదారుల అరెస్టు

**జనగామ, మన చౌరాస్తా :** గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని జనగామ పోలీసులు అరెస్టు చేశారు. జనగామ సీఐ రఘుపతి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం జనగామలో పెట్రోలింగ్ చేస్తుండగా యశ్వంతపూర్ గ్రామ సమీపంలోని రేణుక ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఇద్దరు వ్యక్తులు స్పెండర్ బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని పట్టుకొని విచారించారు. వారి వద్ద 700 గ్రాముల గంజాయితో పాటు రూ.15 వేల నగదు లభ్యమైనట్టు తెలిపారు. అరెస్టు అయిన వారిలో అంబేద్కర్‌నగర్‌కు చెందిన గంట బాబు, మరొకరు మైనర్ బాలుడని పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు.





# అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చాలి

- **కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జనగామ మండలం గానుపహాడ్‌లో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అంబేద్కర్ చిన్నతనంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారన్నారు. ఆ అనుభవాల వల్లే ఆయనకు కుల వ్యవస్థ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడాలనే లోతైన సంకల్పం కలిగిందన్నారు. అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చే దిశగా ప్రతి గ్రామంలో యువత చైతన్యంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహ దాత బండిరాజుల తిరుపతమ్మ శంకరయ్య, డాక్టర్ రాజమౌళి, సర్వల నర్సింగరావు, గానుగుపహాడ్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ముక్కెర యాదగిరి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిరా కిష్టస్వామి, మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, జనగామ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, మేడ శ్రీనివాస్, అలెటి సిద్దిరాములు, బొట్లా నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రభుత్వం ఉద్యాన పంటలైన పండ్ల తోటలు, కూరగాయలు, మిరప, పూల తోటలు మొదలైన పంటలకు ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 338 ఎకరాలలో బిందు సేద్యం, 86 యూనిట్లు తుంపర్ల సేద్య పరికరాలు అలాగే ఆయిల్ పాం రైతులకు 1500 ఎకరాలలో బిందుసేద్యం పథకము మంజూరు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ, పెద్ద రైతులకు 80 శాతం రాయితీ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి 100 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తారని తెలిపారు. జిల్లాలోని పండ్ల తోటలు, కూరగాయలు, మిరప, పుల తోటలు మొదలైన పంటలు పండించే రైతులు, ఆయిల్ ఫాం సాగు చేయదలుచుకున్న రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతులు మీసేవ ద్వారా తమ పేరును నమోదు చేసుకుని దరఖాస్తు ఫారాన్ని పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం నఖలు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటో జతపరచి సంబంధిత ఉద్యాన అధికారికి గాని, జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో గాని సమర్పించాలని తెలిపారు.

# పెంటయ్య త్యాగాలు వృథాకావు

- **సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్**




**జనగామ, మన చౌరాస్తా :** కార్మికుల ఉద్యమ నేత ఆకుల పెంటయ్య త్యాగాలు వృథా కావని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ నేడు పట్టణంలోని గ్రెయిన్ మార్కెట్ వద్ద ఆకుల పెంటయ్య 12వ వర్ధంతి సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. జనగామ పట్టణంలో కార్మిక సంఘం వ్యవస్థాపకులుగా కార్మికుల కోసం అనునిత్యం పోరాడిన మహోన్నత వ్యక్తి పెంటయ్య అని కొనియడారు. అలాంటి పోరాట యోధుడి వర్ధంతి సభకు పార్టీ సభ్యులు, శ్రేయోభిలాషులు విధిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.



# హారర్ కామెడీలో రష్మిక

**మన చౌరాస్తా, సినిమా :** ప్రస్తుతం నేషనల్ క్రష్ రష్మిక మందన్నా చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు రష్మిక నటిస్తున్న పుష్ప 2, గర్ల్ ఫ్రెండ్, రెయిన్ బో చిత్రాలు షూటింగ్ జరుపుకుంటున్నాయి. తాజాగా ఈ బ్యూటీ మరో బాలీవుడ్ ఆఫర్ అందుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల హిందీలో 'ముంజ్యా' చిత్రం ఇటీవల విడుదలై విజయాన్ని అందుకుంది. ఆదిత్య సర్పోథర్ దర్శకత్వం ఈ హారర్ కామెడీ మూవీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు ఆదిత్య కొత్త హారర్ కామెడీ మూవీ తెరకెక్కించేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. ఇందులో ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్న కలిసి నటించనున్నారు. ఈ ఏడాది చివర్లో సినిమా సెట్స్ పైకి వచ్చే అవకాశం ఉంది. ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్న తొలిసారి కలిసి వస్తున్నారు. అతనికి విభిన్నమైన పాత్రలు ఇచ్చినట్లు సమాచారం. ఈ సినిమా స్క్రిప్ట్ చాలా బలంగా ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. రష్మిక 'పుష్ప 2' సినిమాతో బిజీగా ఉంది. ఈ సినిమాను ఏడాది చివర్లో విడుదల చేయాలని అనౌన్స్ చేశారు. ఇందులో అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్నారు. హిందీలో యానిమల్ 2 చిత్రంలో నటించనుంది. గతేడాది విడుదలైన యానిమల్ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలే కాకుండా రష్మిక మరిన్ని ఆఫర్స్ అందుకోనున్నట్లు తెలుస్తోంది.



# ముగిసిన స్పోర్ట్స్ మీట్

- ఉత్సాహంగా పాల్గొన్న ప్రెస్ క్లబ్ సభ్యులు
- నిర్వహణకు సహకరించిన వారికి కమిటీ కృతజ్ఞతలు

**హనుమకొండ, మన చౌరాస్తా :**
గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలు నేటితో ముగిసాయి. ఇందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపింది. ఈనెల 13న 3 కే రన్ తో ప్రారంభమైన స్పోర్ట్స్ మీట్ 2024 లో చెస్, క్యారం, షటిల్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. మొదటి 4 విభాగాల్లో క్రీడలు గతవారం ముగియగా, వర్షం కారణంగా క్రికెట్ పోటీలు కాస్త ఆలస్యమయ్యాయి. బుధవారంతో అన్ని పోటీలు నిర్వహణ విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో పాల్గొన్న గౌరవ సభ్యులకు, ప్రారంభ కార్యక్రమంతో పాటు, రోజువారి క్రీడల్లో పాల్గొని సభ్యులైన క్రీడాకారులను అభినందించిన ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎంఎల్ఏ కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రేస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, బీజేపీ హన్మకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, టీజీవో, టీఎన్జీవో నేతలు, అన్నమనేని జగన్మోహన్ రావు, రాజేందర్ ల బృందానికి, రిటైర్డ్ విద్యాశాఖాధికారి బూర విద్యాసాగర్, జర్నలిస్ట్ యూనియన్ల నాయకులు, క్రీడాపోటీలకు సహాయ, సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరికీ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్ ధన్యవాదాలు తెలియజేశారు.

క్రీడల నిర్వహణకు మైదానాలు, కోచ్లు, ఎంపైర్లు, ఆర్బిట్రేటర్ల నియామకానికి సహకరించిన హన్మకొండ జిల్లా క్రీడాశాఖ అధికారి అశోక్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ జ్యోతి, క్రీడల రోజువారి నిర్వహణలో పాలుపంచుకున్న క్లబ్ బాధ్యులైన వివిధ కమిటీల ఇంచార్జిలకు, క్లబ్ అటెండెంట్ రాజు, వాచ్ మెన్ దస్రూ లకు, క్రీడాకారులకు రోజు వారి తాగునీరు, టీ, టిఫిన్లు, భోజనాలు, పళ్లు, స్నాక్స్, అందించడంలో భాగం పంచుకున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## త్వరలో బహుమతుల ప్రదానం

అతి త్వరలోనే స్పోర్ట్స్ మీట్ 2024 లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేయనున్నట్టు ప్రెస్ క్లబ్ కమిటీ పేర్కొంది. ప్రజాప్రతినిధులు, అధికారుల సమయాన్ని బట్టి వేడుక నిర్వహించనున్నట్టు తెలిపింది.



## హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్

- విజేతగా నిలిచిన కెమెరామెన్స్ (XI) జట్టు

**హనుమకొండ, మన చౌరాస్తా :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్మీట్ - 2024 లో భాగంగా ఆర్ట్స్ కాలేజ్ లో బుధవారం ఉదయం క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. కెమెరామెన్స్ (XI) వర్సెస్ యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్ టాస్ వేసి ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్టు 15 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసింది. ఓపెనర్గా బరిలోకి దిగిన తిరుపతి 38 బాల్స్ లో 56 పరుగులు సాధించి నాటౌట్గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కెమెరా మెన్స్ (XI) జట్టు 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసి ఫైనల్ మ్యాచ్లో విజయం సాధించారు. 17 బాల్స్ ఎదుర్కొని 39 రన్స్ చేయడంతో పాటు భౌలింగ్లో 1 వికెట్ తీసిన మున్నా కెమెరా మెన్స్ (XI) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ను గెలుచుకున్నాడు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు గోకరపు శ్యాం, బొడిగె శ్రీను, జాయింట్ సెక్రెటరీలు వలిశెట్టి సుధాకర్, పొడిశెట్టి విష్ణువర్ధన్, ఈసీ మెంబర్లు భరత్, దిలీప్, శ్రీకాంత్, నయీంపాషా, జర్నలిస్టు నేతలు గడ్డం రాజిరెడ్డి, బీఆర్ లెనిన్, కక్కెర్ల అనిల్ కుమార్, గడ్డం కేశవమూర్తి, మస్కపురి సుధాకర్, స్టాఫ్ రిపోర్టర్లు, బ్యూరోలు, జర్నలిస్టులు, కెమెరామెన్లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.